సాక్షి ఖమ్మం
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



సమస్యల పరిష్కారంపై దృష్టి

మధిర మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. 8లో



తీసేస్తారట.. ఏం చేద్దాం..?

ఖమ్మం నగరపాలక సంస్థలో అవసరానికి మించి ఉన్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగిస్తారనే ప్రచారం సాగుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత కొన్ని చోట్ల వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు



చెక్కు అందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కంట్రోల్ రూమ్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎ.వెంకట్రావు కుటుంబస భ్యులకు రూ. 1.65లక్షల భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును సీపీ సునీల్‌దత్ గురువారం అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. శాఖాపరంగా ఎలాంటి సహాయ సహ కారాలు అందించేందుకైనా పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. అమరులైన పోలీసు కుటుంబాలను అన్ని విధా లా ఆదుకుంటామన్నారు.

జెడ్పీ సీఈఓగా దీక్షా రైనా బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన దీక్షా రైనా

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా ప్రజా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా జమ్మూ కశ్మీర్ రాష్ట్రా నికి చెందిన దీక్షా రైనా గురువారం బాధ్యత లు స్వీకరించారు. హైదరాబాద్‌లో పం చాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సెర్ప్ విభాగంలో ఐటీ వింగ్ ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తున్న రైనాను ఖమ్మం జెడ్పీ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ప్రస్తుత ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిష నర్ అభిషేక్ ఆగస్త్య సతీమణి. రైనా జమ్మూ కశ్మీర్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి గ్రూప్–1 సర్వీస్ అధికారిగా 2020 బ్యాచ్‌లో ఎంపికయ్యా రు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సూప రింటెండెంట్ రమణ శేఖర్ జెడ్పీ ఉద్యోగులను ఆమెకు పరిచయం చేశారు. ఆ తర్వాత జెడ్పీ లోని పలు విభాగాలను ఆమె సందర్శించారు.

డీఏఓగా పుల్లయ్య..



పుల్లయ్యను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ)గా డి.పుల్లయ్య గురువారం బాధ్యత లు స్వీకరించారు. ఆదిలాబాద్ డీఏఓగా పూర్తి అదనపు బాధ్యతలతో విధులు నిర్వహిస్తున్న పుల్లయ్యను జిల్లా సాంకేతిక సహాయ వ్యవ సాయ సంచాలకులుగా నియమించడంతో పాటు డీఏఓగా కూడా బాధ్యతలు అప్పగిం చారు. బాధ్యతలు స్వీకరించిన పుల్లయ్యకు ఏడీఏ(ప్లాంట్ ప్రొటెక్షన్) వాసవీరాణి, సాంకే తిక వ్యవసాయాధికారులు పవన్‌కుమార్, నవీన్, శ్రీనివాస్, నేలకొండపల్లి, కొణిజర్ల వ్యవసాయాధికారులు ప్రసాద్, బాలాజీ, సీనియర్ అసిస్టెంట్లు లక్ష్మి, రాధిక, మాధవి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కాలపరిమితి ముగిస్తే అభ్యర్థనలు పంపండి

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో సమగ్ర శిక్ష ఆధ్వ ర్యంలో నడుస్తున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఈ ఏడాది ఆగస్టు ఒకటి నాటికి రెండేళ్ల కాలపరిమితి పూర్తి చేసుకున్న తాత్కా లిక కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ అభ్యర్థనలను ఆన్‌లైన్‌లో శుక్రవారం సమర్పించాలని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈ మేరకు గురు వారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ప్రత్యేకాధికారులు, పీజీసీఆర్‌టీలు, సీఆర్టీలు, ఏఎన్‌ఎంలు, పీఈటీ లు, ప్రస్తుత కేజీబీవీ నుంచి ఇతర కేజీబీవీలకు మార్పును కోరుకునే వారు ఆన్‌లైన్‌లో samagrshiksha.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని, ఆ తర్వాత సంబంధిత ధ్రువపత్రాలను స్పెషల్ ఆఫీసర్ల పరిశీలనకు సమర్పించాలని సూచించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన


పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మ వారికి సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపు ష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్య క్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చ కులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.


ఎల్‌ఆర్‌ఎస్ షురూ..

ఎల్‌ఆర్‌ఎస్ (లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) ప్రక్రియను జిల్లా యంత్రాంగం ప్రారంభించింది. లే ఔట్ ఆమోదం పొందని వెంచర్లలో కొనుగోలు చేసిన స్థలాలను రెగ్యులర్ చేయడానికి గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రవేశపెట్టారు. అయితే పలు కారణాలతో ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దీనిపై దృష్టి సారించడంతో ఇటీవల మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఈ మేరకు జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను బుధవారం నుంచి క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్ ద్వారా మ్యాపింగ్ ఇస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం జిల్లా వ్యాప్తంగా 91,720 దరఖాస్తులు వచ్చాయి. వీటిని మూడు దశల్లో పూర్తిస్థాయిలో పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్న వాటికి అనుమతులు జారీ చేయనున్నారు. ఈ ప్రక్రియ మొత్తం వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తయ్యేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

రెగ్యులరైజేషన్‌కు 91,720 దరఖాస్తులు

- క్షేత్రస్థాయిలో 21,152 అప్లికేషన్ల పరిశీలన
- అన్నీ సక్రమంగా ఉంటే అనుమతులు
- వచ్చే ఏడాది మార్చిలోగా ప్రక్రియ పూర్తికి చర్యలు





క్షేత్రస్థాయిలో పరిశీలన..

జిల్లాల్లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు మొదటి దశలో క్షేత్రస్థాయి పరిశీలనను బుధవారం ప్రారంభించారు. తొలుత సీజీజీ (సెం టర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) ద్వారా ఆన్‌లైన్‌లో దర ఖాస్తులను పరిశీలిస్తున్నారు. అనంతరం ప్రత్యేకం గా తయారు చేసిన మొబైల్ యాప్ ద్వారా పరిశీలన జరుగుతోంది. సర్వే నంబర్ వారీగా సం బంధిత రెవెన్యూ గ్రామం లేదా మున్సిపాలిటీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన బృందం పరిశీలిస్తోంది. ఈ బృం దం జీపీఎస్ ద్వారా సదరు భూమి హద్దులు, ఇతర సమాచారాన్ని మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తోం ది. అదే సమయంలో ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలోవి కావని ఈ బృందం ధ్రువీకరించాల్సి ఉంటుంది.

పకడ్బందీగా రెండు, మూడు దశలు..

నిబంధనలకు అనుగుణంగా ఉన్న స్థలాలకు మాత్ర మే అనుమతులు లభించేలా ప్రభుత్వం మార్గదర్శ కాలు రూపొందించింది. ఈ క్రమంలో రెండు, మూ డు దశల్లో పకడ్బందీగా పరిశీలన చేపట్టనున్నారు. రెండో దశలో.. దరఖాస్తులు స్థానిక సంస్థల నిబంధ నలకు అనుగుణంగా ఉన్నాయా, రోడ్డు వెడల్పు, ఖాళీ స్థలం తదితర నిబంధనలు లేఔట్ లో పాటిం చారా అనే అంశాలను పరిశీలించి టౌన్ ప్లానింగ్ అధికారి ఆమోదిస్తారు. దీంతో ఇందుకు సంబం ధించిన ఫీజు జనరేట్ అవుతుంది. ఈ విషయా న్ని దరఖాస్తుదారులకు తెలియజేసి, ఫీజు చెల్లిం చిన తర్వాత మూడో దశకు దరఖాస్తులు వెళ్తా యి. వీటిలో ఒక శాతం దరఖాస్తులను డిప్యూటీ తహసీల్దార్ క్రాస్ చెక్ చేస్తారు. మూడో దశలో దర ఖాస్తులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇతర అధికారులు పరిశీలించి ధ్రువీకరిస్తారు. అర్బన్ డెవ లప్‌మెంట్ అథారిటీ, గ్రామపంచాయతీల్లోని దర ఖాస్తులను కూడా అదనపు కలెక్టర్ ధ్రువీకరిస్తారు. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్‌లు జారీ అవుతాయి.

మంత్రుల చొరవతో..

గతంలో ముందుకు సాగని ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్ర మార్క, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమా చార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో కదిలింది. ఈ క్రమంలో కలెక్టర్ తోపాటు ఇతర అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ దర ఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టారు. ఇప్ప టికే కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దీనిపై అధికారు లతో సమీక్షించారు. ఎప్పటికప్పుడు పలు సూచ నలు చేయడంతోపాటు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ ప్రక్రియపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయిల్లో అవగాహన కార్య క్రమాల నిర్వహణ సాగుతోంది.

క్లస్టర్ల వారీగా..

జిల్లా వ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం 91,720 దరఖాస్తులు వచ్చాయి. ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల పరిధిలో 51,425 దరఖాస్తులు, సుడా పరిధిలో 26,476, జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో 13,819 దరఖాస్తులు వచ్చాయి. అధికారుల బృందం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సర్వే నంబర్‌ను క్లస్టర్‌గా తీసుకుని, ఒక సర్వే నంబర్‌లో ఎన్ని దరఖాస్తులు ఉంటే అన్నింటినీ ఒకేసారి పరిశీలిస్తోంది. గతంతో పాటు ప్రస్తుతం కలిపి ఇప్పటి వరకు 21,152 దరఖాస్తుల పరిశీలన పూర్త యింది. ఇందులో 4,459 మందికి సంబంధిత ఫీజు చెల్లించాలని సమాచారం అందిం చారు. 616 దరఖాస్తులకు అన్ని అనుమతులూ లభించాయి. ఇప్పటి వరకు ప్రభుత్వా నికి ఫీజుల రూపంలో రూ.3,32,21,610 సమకూరాయి.

ఎల్‌ఆర్‌ఎస్ కోసం మున్సిపాలిటీల వారీగా వచ్చిన దరఖాస్తులు..

మున్సిపాలిటీ	దరఖాస్తులు	పరిశీలించిన ప్లాట్లు	అనుమతి పొందినవి
ఖమ్మం కార్పొరేషన్	39,945	15,060	503
మధిర	4,276	2,027	49
సత్తుపల్లి	3,688	2,265	38
వైరా	3,516	1,065	26
మొత్తం	51,425	20,417	616

రైతుల కోసం ప్రాణాలైనా ఇస్తాం

- ఆంక్షలు లేకుండా అర్హులందరికీ రుణమాఫీ చేయాలి
- మాజీ మంత్రి పువ్వాడ డిమాండ్



మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: రైతుల కోసం తమ ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధమేనని, దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకూ పోరాడుతామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కు మార్ అన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం మంచుకొండ ప్రధాన రహ దారిపై రైతు ధర్నా నిర్వహించారు. మొదట ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, పాలాభిషేకం చేశారు. ఈ సంద ర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమా ఫీ చేయాలని కోరారు. లేదంటే ప్రజలే కాంగ్రెస్ మెడలు వంచుతారని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ ప్రక్రియలో చిత్తశుద్ధి లేదని, శాస్త్రీయంగా లెక్కలు లేకుండా ఇష్టానుసారంగా చేశారని ఆరోపించారు. మాయమాటలు చెప్పి అధికారం లోకి వచ్చారని, అడ్డగోలు ఆంక్షలు, అర్థం లేని షర తులతో రైతులను మోసం చేస్తున్నారని మండిప డ్డారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, టేకు లపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సంఘం చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరునాయక్, నాయకులు ఆర్జేసీ కృష్ణ, మద్దినేని వెం కటరమణ, కూరాకుల నాగభూషణం, గుత్తా రవి, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, నాగండ్ల కోటి, మోతారపు శ్రావణిసుధాకర్, పగడాల శ్రీ విద్య, కూరాకుల వలరాజు, సరస్వతి, దండా జ్యోతి రెడ్డి, కన్నం ప్రసన్న, దానాల శ్రీకాంత్, తోట వీరభద్రం, దేవభక్తిని కిషోర్, పిన్ని కోటేశ్వరరావు, సూర్య, సత్య నారాయణ, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు తాజ్, మచ్చ నరేందర్, కొప్పెర సర్పింహారావు, దడాల రఘు, నాగండ్ల భద్రయ్య, రామోజి, దానయ్య, భూచక్రం తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన నిరసనలు 9లో

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



చల్లా దేవి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మా నికి చెందిన తెలుగు ఉపాధ్యా యురాలు చల్లాదేవి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుం చి డాక్టరేట్ పట్టా అందుకు న్నారు. ఆమె ప్రస్తుతం కాజీపేట మైనార్టీ గురుకుల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తు న్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మం డలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన కవి పెద్దిం టి అశోక్ కుమార్ కథాసాహిత్యంపై తాను పరిశో ధన చేసినట్లు చల్లాదేవి తెలిపారు. నాగార్జున విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో సహాయక ఆచార్యు లుగా పనిచేస్తున్న నారిశెట్టి వెంకట కృష్ణారావు పర్య వేక్షణలో 'పెద్దింటి అశోక్ కుమార్ కథాసాహిత్యం పరిశీలన' అనే అంశం పై పరిశోధన చేసి డాక్టరేట్ పొందానని చెప్పారు.

హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమాతో ఉపాధి

- హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ జేడీ ఇందుమతి



మాట్లాడుతున్న ఇందుమతి

ఖమ్మంగాంధీచౌక్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో డిప్లొమా చేస్తే ఉపాధి అవ కాశాలు ఎక్కువగా ఉంటాయని హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ జాయింట్ డైరెక్టర్ బి.ఇందుమతి అన్నారు. హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశాల కోసం కలెక్టరేట్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ కృషితో సిద్ధించిన ఇండియన్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో అర్హులైన యువత చేరి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చు కోవాలని సూచించారు. ప్రస్తుతం 60 సీట్లు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. అడ్మిషన్ల కోసం isht.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సదస్సులో సంస్థ ఏడీ ఎం .విజయలక్ష్మి, రాష్ట్ర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, బిజ్జ వెంకటేశ్వర్లు, జిల్లాలోని సహ కార సంఘాల అధ్యక్షులు, కార్మికులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ల నియామకానికి చర్యలు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల నియామ కానికి ఎన్పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్‌కు కేటాయించిన అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్లను గురువారం అధికారులు పరిశీలించారు. 2022లో రాష్ట్ర వ్యాప్తం గా జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరే టర్ పోస్టుల భర్తీకి విద్యుత్ శాఖ రాత పరీక్ష నిర్వ హించింది. ఈ ప్రక్రియపై కొందరు కోర్టును ఆశ్ర యించారు. దీంతో అప్పటి నుంచి పోస్టుల భర్తీ నిలిచిపోయింది. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి జూనియర్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీ అంశాన్ని పరిశీంచి కోర్టును ఆశ్రయించిన అభ్యర్థుల పోస్టు లను మినహాయించి మిగిలిన వారి నియామక ప్రక్రియ చేపట్టాలని సర్కిల్ అధికారులను ఆదేశిం చారు. ఖమ్మం సర్కిల్‌కు 5 పోస్టులు మంజూరు కాగా, ఒక అభ్యర్థి కోర్టులో కేసు వేసిన వారిలో ఉన్నారు. దీంతో మిగిలిన నలుగురి నియామక ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. నలుగు రిలో ఒకరు మరో ఉద్యోగంలో చేరారని పేర్కొం టూ అన్ విల్లింగ్ లెటర్‌ను అధికారులకు అందిం చారు. మిగిలిన ముగ్గురి సర్టిఫికెట్లను ఎస్ఈ సురేం దర్, డీఈ టెక్నికల్ బాబూరావు, సీనియర్ అకౌం ట్స్ ఆఫీసర్ శ్రీధర్, అడ్మినిస్ట్రేషన్ అధికారి పాషాతో కూడిన కమిటీ పరిశీలించి నివేదికను సీఎండీ కార్యా లయానికి పంపించింది. సీఎండీ తదుపరి ఆదేశాల మేరకు ఆయా అభ్యర్థులకు ఖమ్మం సర్కిల్ పరిధిలో పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉంది.

ఆర్‌ఓఆర్ చట్టంపై సలహాలు, సూచనలు ఇవ్వండి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంసహకారనగర్: భూ సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఆర్ ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు అందజేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురు వారం రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, నిపుణులతో వర్క్‌షాప్ నిర్వహించారు. నూతన రెవెన్యూ చట్టం–2024 ముసాయిదా బిల్లులో పేర్కొన్న అంశాలు, ఈ బిల్లు తీసుకురావడంలో గల ఉద్దేశాన్ని జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం.రాజే శ్వరి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ.. భూ సమస్యల పరిష్కారానికి నూతన రెవెన్యూ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంక ల్పించిందని తెలిపారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమమైన భూ రికార్డుల నిర్వహ ణను పరిశీలించిన నిపుణుల బృందం నూతన రెవెన్యూ చట్టం– 2024 ముసాయిదా బిల్లు రూపొందించిందని చెప్పారు. నూతన చట్టం రూప కల్పనలో ప్రజలను విస్తృతంగా భాగస్వామ్యం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. భూ రికార్డుల నిర్వహణ మెరుగ్గా ఉండేలా ముసాయిదా బిల్లుపై రైతు సం ఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధు లు, రెవెన్యూ అధికారులు (రిటైర్డ్– సర్వీస్) తమ సూచనలు అందజేయాలని కలెక్టర్ కోరారు. నూతన రెవెన్యూ చట్టం ముసాయిదా బిల్లుపై సల హాలు సూచనలు ఏమైనా ఉంటే వెంటనే రాతపూ ర్వకంగా కలెక్టరేట్ కార్యాలయానికి అందిస్తే, వాటిని ఒక నివేదిక రూపంలో సిద్ధం చేసి తుది చట్ట రూపకల్పన కోసం సీసీఎల్ఏకు సమర్పిస్తామని తెలిపారు. కాగా, వర్క్‌షాప్‌లో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు తమ సూచనలు, సలహాలు తెలియజే శారు. గ్రామంలోని ఆబాది భూముల రికార్డులు అప్‌డేట్ చేయాలని, సాదా బైనామా భూముల రిజిస్ట్రేషన్ రుసుం వసూలు చేయాలని, పొజిషన్ కాలం ఉండాలని, అప్పిలేట్ అథారిటీ ఆర్డీఓ స్థాయి లో ఉండాలని సూచించారు. సమగ్ర భూ సర్వే చేప ట్టాలని, భూ రిజిస్ట్రేషన్ మార్పులపై గ్రామాల్లో ప్రచారం చేయాలని కోరారు. వారసత్వ మ్యుటే షన్లు ఉచితంగా చేయాలని, రెవెన్యూ గ్రామాల వారీగా కాకుండా గ్రామాల వారీగా రికార్డులు చేప ట్టాలని అన్నారు. సాదా బైనామా దరఖాస్తులన్నీ పరిష్కరించాలని సూచించారు. నూతన ఆర్‌ఓఆర్ చట్టం అమలుకు ప్రతి గ్రామంలో రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు తీసుకోవాలని, భూ సమస్యల అప్పిలేట్ అథారిటీ జిల్లా స్థాయిలోనే ఉండేలా చూడాలని కోరారు. సమావేశంలో ఆర్డీఓలు జి.గణే ష్, ఎల్.రాజేందర్, కలెక్టరేట్ ఏఓ అరుణ, జిల్లా లోని తహసీల్దార్లు, న్యాయవాదులు, రైతు సం ఘాల నాయకులు పాల్గొన్నారు.

'జోన్ -3' ఆయకట్టుకు మహర్దశ

- జోన్–2 పరిధిలోకి తీసుకొచ్చేందుకు కసరత్తు
- వైరా నదిపై వంగవీడు వద్ద రూ.500 కోట్ల అంచనాలతో లిఫ్ట్ ఇరిగేషన్

ఖమ్మంఅర్బన్: సాగర్ ఆయకట్టు కింద జిల్లాలోని 17 మండలాల్లో భూములు సాగవుతున్నాయి. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే అప్పటి పరిస్థితులకు అనుగుణంగా జిల్లా ఆయక ట్టును మూడు జోన్ల పరిధిలోకి తీసుకొచ్చారు. మూడో జోన్ పరిధి అంటే ఏపీలోని గ్రామాలను దాటి సుమారు 30 కిలోమీటర్ల దూరం కాల్వ ప్రవాహం తర్వాత తెలంగాణ ఆయకట్టుకు నీరు అం దాల్సి ఉంటుంది. అప్పటి లెక్కల ప్రకారం మధిర. ఎర్రుపాలెం మండలాల పరిధిలో సుమారు 18వేల ఎకరాలకు నీరు అందించాల్సి ఉండేది. జోన్ -3లో ఉన్న తెలంగాణ ఆయకట్టుకు ఏపీ రాష్ట్రంలోని ఆయ కట్టు తడిసిన తర్వాతే నీరందేది. కాల్వలకు చివరన ఉండడంతో జోన్ - 3 ఆయకట్టుకు ఎప్పుడూ నీటి ఎద్దడి ఉండేది. సాగు చేసిన పైర్లు చేతికందే దశలో ఎండిపోవడం, నీటి కోసం రైతులు ఆందోళన చేయడం పరిపాటిగా మారేది. అలాగే ఉమ్మడి ఏపీ రాష్ట్రంగా ఉన్న రోజుల్లో అష్టకష్టాలతో సాగు నీరు సరఫరా అయ్యేది. ఇక రాష్ట్ర విభజన తర్వాత ఈ సమస్య మరింత జటిలంగా మారింది. జోన్ -3లో ఏపీ ఇంజనీర్లు నీటిని తమ కోటాల ప్రకారం తరలిం చే క్రమంలో తెలంగాణ ఆయకట్టుకు నీరు అందించ డంలో అడగడుగునా ఇబ్బందులు వచ్చేవి. దీంతో ఆశలు వదులుకున్న ఆప్రాంత రైతులు తమ ఆయక ట్టును కూడా జోన్-2 పరిధిలోకి తీసుకొచ్చి వానాకాలం పంటల సాగుకే నీరందించాలనే డిమాం డ్ పెరిగింది. అప్పటి నుంచి రకరకాల ప్రతిపాదనల తో నీరు అందించేందుకు ఇంజనీర్లు కుస్తీ పడుతు న్నారు. తాజాగా మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్ర మార్క డిప్యూటీ సీఎం కావడంతో ఆయకట్టు జోన్ బదలాయింపు కోసం భారీ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం పై కసరత్తు చేశారు. ఇప్పటికే సుమారు రూ.500 కోట్లకు పైగా అంచనాలతో వైరా నదిపై మధిర మం డల వంగవీడు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసేం దుకు ప్రతిపాదనలు రూపొందించారు. దీంతో అక్కడి నుంచి జోన్-3లో ఉన్న ఆయకట్టుతో పాటు పై రెండు మండలాల్లో అదనంగా మరికొంత అయ కట్టుకు మొత్తంగా 30 కిలోమీటర్లపైగా లిఫ్ట్ ద్వారా సుమారు 33వేల ఎకరాలకు సాగు నీరు అందించేలా ప్రభుత్వ అనుమతి కోసం పంపినట్లు తెలిసింది. ఈ మేరకు వారం, పది రోజుల్లో మంజూరు అనుమతు లు వచ్చే అవకాశం ఉందని ఎర్రుపాలెంలో డిప్యూటీ సీఎం ప్రకటించడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్త మవుతున్నాయి.

జిల్లాలో జోరువాన



- వైరాలో 54, ఖమ్మంలో 49.8 మి.మీ. వర్షపాతం
- సాగు చేస్తున్న పంటలకు ప్రయోజనకరం

మండలాల వారీగా గురువారం నమోదైన వర్షపాతం(మి.మీ.)

మండలం	వర్షపాతం
వైరా	54.0
ఖమ్మం అర్బన్	49.8
కామేపల్లి	38.6
నేలకొండపల్లి	38.6
ముదిగొండ	33.2
చింతకాని	30.8
రఘునాథపాలెం	25.6
ఖమ్మం రూరల్	23.2
కొణిజర్ల	22.4
కూసుమంచి	17.6
తల్లాడ	16.2
మధిర	14.6
ఎర్రుపాలెం	11.6
బోనకల్	11.2
సింగరేణి	5.6
కల్లూరు	5.6
తిరుమలాయపాలెం	3.6

ఖమ్మంవ్యవసాయం: బంగాళాఖాతంలో విస్తరిం చిన రుతుపవన ద్రోణి కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసిం ది. మరో రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని వాతావరణ కేంద్రం సంచాలకులు ప్రకటించారు. గురువారం తెల్లవారుజాము నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటున 19.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వైరాలో 54 మి.మీ., ఖమ్మంలో 49.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, పలు మండలాల్లో తేలికపాటి నుం చి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో నాలాలు పొంగి ప్రవహించటంతో రహదారులు జలమయమయ్యాయి. ఆగస్టులో సాధారణ వర్షపాతం 176.7 మి.మీ. కాగా ఇప్పటికే 194.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. 9.9 శాతం వర్షపాతం అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నా జిల్లాలో పది రోజులుగా ఉష్ణోగ్రతల ప్రభావం కూడా ఎక్కువగానే ఉంది. కనిష్టంగా 25 డిగ్రీల నుంచి గరిష్టంగా 33 సెల్సియ స్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం..

ఈ ఏడాది వానాకాలం ఆరంభం నుంచి విస్తారంగా వానలు కురుస్తున్నాయి. జూన్, జూలై, ఆగస్టులో సాధారణానికి మించి వర్షపాతం నమోదవుతోంది. జలాశయాల్లోకి కూడా భారీగానే నీరు చేరింది. జిల్లా లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 5,96,662 ఎక రాలు కాగా, ఇప్పటివరకు 3,98,888 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల అవుతుండడంతో వరి సాగు ఊపందు కుంది. ఈ పంట సాధారణ సాగు విస్తీర్ణం 2,83,943 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,49,857 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ చెబుతోంది. ప్రస్తుత వర్షాలతో ఈ విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత వానలతో పత్తికి ప్రయోజనమని రైతు లు అంటున్నారు. పండ్ల తోటలకు కూడా ప్రయోజన మేనని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

హ్యూమన్ రైట్స్ కన్వీనర్‌గా న్యాయవాది 'కండె'



నియామక పత్రం అందుకుంటున్న వెంకటేశ్వర్‌రావు

ఖమ్మం లీగల్ : ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది, ఖమ్మం బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కండె వెంకటేశ్వర్ రావు లీగల్ హ్యూమన్ రైట్స్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తన నియామకం పట్ల ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వెంకటేశ్వర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

టీఎన్జీవో సభ్యత్వం నుంచి అఫ్జల్ హసన్ తొలగింపు

ఖమ్మంసహకారనగర్: టీఎన్జీవో ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు అఫ్జల్ హసన్‌ను టీఎన్జీవోస్ యూనియన్ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు టీఎన్జీవో కేంద్ర సంఘం తెలిపిందని టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ ముత్యాల సత్యనారాయణగౌడ్, కో–కన్వీనర్ కొణిదెన శ్రీనివాస్, సభ్యులు జడ్.ఎస్.జైపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలంగా అఫ్జల్ హసన్ అనేక సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

భూమి కోసం స్వాతంత్య్ర సమరయోధుడి ఆక్రందన

నేలకొండపల్లి: తన భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని స్వాతంత్య్ర సమరయోధుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వున్నం వెంకయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అనాసాగారంలో తనకున్న మూడెకరాల భూమిని గత 45ఏళ్లుగా సాగు చేసుకుంటున్నానని, ప్రస్తుతం తన ఆరోగ్యం బాగలేక మంచం పడడంతో ఇదే అదనుగా భావించి కొందరు దాన్ని ఆక్రమించుకుని సాగు చేస్తున్నారన్నారు. పోలీసులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశానని, రెండు రోజుల్లో కలెక్టర్‌ను కలిసి తన గోడును వివరిస్తానని పేర్కొన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సమగ్రంగా విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

జింకను కాపాడిన అటవీ సిబ్బంది



ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): మండల పరిధిలోని తిప్పనపల్లి అడవిలో గురువారం ఓ జింకను రెండు కుక్కలు తరుముతున్నాయి. ఈక్రమంలో విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ సిబ్బంది గమనించి వెంబడించారు. జింక సూడిగా ఉండడంతో ఎక్కువ దూరం పరుగెత్తలేక కిందపడగా అటవీ సిబ్బంది ఆ కుక్కలను తరమికొట్టి, వారి వాహనంలో జింకను రామవరంలోని వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం దానికి ప్రాథమిక చికిత్స చేసి సంబంధిత అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ విజయ, సిబ్బంది రాంప్రసాద్, రమేష్, వాచర్లు, వెటర్నరీ సిబ్బంది ఉన్నారు.


ఆలయంలో హుండీ చోరీ

కామేపల్లి: గుర్తు తెలియని దుండగులు దేవాలయంలోకి చొరబడి హుండీ ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీతిరుపతమ్మతల్లి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయం గేటు తాళం పగలకొట్టి ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లారు. దేవాలయం వెనుక భాగంలో హుండీని పగలకొట్టి అందులోని సుమారు రూ.5వేల నగదును అపహరించారు. ఈమేరకు కామేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

ఇల్లెందు: అన్నయ్యకు రాఖీ కట్టేందుకు వచ్చి మరుసటి రోజున తిరిగి అత్తగారింటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన ఓ వివాహిత నేటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. గత నెలలో స్టేషన్ బస్తీకి చెందిన ప్రియా అనే యువతికి కృష్ణా జిల్లా కొండముక్కల గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరిగింది. ఈ నెల 19న సోదరులకు రాఖీ కట్టేందుకు స్టేషన్ బస్తీకి వచ్చింది. రాఖీ కట్టి మరుసటి రోజు అత్తారింటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లింది కాని ఇంటికి చేరలేదు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి శాంతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ తుల్సీరాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

తీసేస్తారట... ఏం చేద్దాం?!

- కేఎంసీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిలో గుబులు
- ఏదో ఓ విభాగంలో పని దక్కించుకునేందుకు ఆరాటం
- వర్గాలుగా విడిపోయి పోటాపోటీగా మద్యం పార్టీలు



ఖమ్మం మున్సిపల్ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: పరిధి, జనాభాలో పెద్దదైన వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పోలిస్తే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం(కేఎంసీ)లోనే సిబ్బంది సంఖ్య అధికంగా ఉందనే చర్చ జరుగుతోంది. 60 డివిజన్లు కలిగిన కేఎంసీ కార్యాలయంలో ఇంత మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందితో ఏం పని చేయించుకుంటున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీటికి తోడు ఇటీవల కేఎంసీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. చాలామంది పని లేకుండా ఖాళీగా తిరుగుతున్నారని, ప్రక్షాళన చేసి అవసరం లేని ఉద్యోగులను తొలగించాలని ప్రజాప్రతినిధులు సైతం సూచనలు వస్తున్నాయి. దీంతో కేఎంసీలోని ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో గుబులు మొదలైనట్లు తెలుస్తోంది. ఎక్కడ తమను తొలగిస్తారో అనే ఆందోళనతో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం. ఔట్ సోర్సింగ్ విధానంలో కార్యాలయంలో 62 మంది ఆఫీస్ స్టాఫ్ హోదాలో, 30 మంది నాలుగు తరగతి ఉద్యోగుల హోదాలో మొత్తం 92 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా ప్రతీ రోజు కేఎంసీ కార్యాలయంలో సీ1 సెక్షన్ వద్ద హాజరు పట్టికల్లో తమ హాజరు నమోదు చేసుకొని వెళ్తున్నారు. వీరిలోని సగానికి పైగా సిబ్బంది ఎవరూ ఎక్కడ పని చేస్తున్నారో అధికారులకు కూడా తెలియని పరిస్థితి ఉంది.

పని కోసం ఆరాటం..

కేఎంసీలో ఉన్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై వస్తున్న ఆరోపణలతో మేయర్, కమిషనర్లు ప్రక్షాళన చేసేందుకు చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం ఖాళీగా ఉన్న సిబ్బంది ఏదో ఒక విభాగంలో పని చేసేందుకు ఆరాటపడుతున్నట్లు తెలుస్తోంది. తమకంటూ ఓ విభాగాన్ని ఏర్పాటు చేసుకొని, ఇన్నాళ్లు కాలం వెళ్లదీస్తూ వచ్చిన కొందరు సిబ్బంది కమిషనర్, ఇతర అధికారుల వద్దకు వెళ్లి తమకు విభాగాలను కేటాయించాలని అడిగినట్లు తెలిసింది. ఇక మరి కొందరు ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి తమకు విభాగాల్లో పని కల్పించేలా చూడాలని కోరుతుండగా.. ఇంకొందరు నేరుగా విభాగాల ప్రధాన అధికారుల వద్దకు వెళ్లి 'మీ వద్ద పని చేస్తాం.. మమ్మల్ని మీ విభాగంలో పని చేసేలా చూడండి'అని కోరుతున్నట్లు తెలుస్తోంది.

వాగ్వాదాలు..

కేఎంసీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది గ్రూపులుగా ఏర్పాడ్డారన్న చర్చ జరుగుతుంది. వీరు సాయంత్రం అయితే చాలు తమ గ్రూపులతో వెళ్లి పార్టీలు చేసుకుంటున్నారని సమాచారం. ఈ పార్టీల్లో ఒకరిపై మరొకరు వాగ్వాదాలకు దిగడమే కాక.. ఇతరులపై అనేక ఆరోపణలు చేస్తూ కేఎంసీ పరువును తీస్తున్నారన్న చర్చ అధికారుల్లో జరుగుతోంది. ఇందులోని ఓ గ్రూపులో ఓ రెగ్యులర్ అధికారి సైతంచేరి సిబ్బందితో కలిసి మద్యం తాగుతూ వారికి వత్తాసు పాడుతున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన పార్టీలో ఇద్దరి సిబ్బంది మధ్య వాగ్వాదం జరగగా.. వారు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో పాటు అధికారులపై తీవ్ర ఆరోపణలు చేసినట్లు సిబ్బంది మధ్య చర్చ జరుగుతోంది. తరుచుగా మద్యం పార్టీలతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు దారితీస్తుండడం గమనార్హం.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



మధిర: సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌నాయక్

మధిర/నేలకొండపల్లి/బోనకల్: మధిర మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. గురువారం మధిర మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో, నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మికంగా రికార్డులను తనిఖీ చేసిన సందర్భంగా, బోనకల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మధిరలో మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అలాగే నేలకొండపల్లి మండలంలో గ్రీవెన్స్‌లో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఇంటింటి సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించి ఓటర్ల జాబితాలపై ఆరా తీశారు. అదేవిధంగా బోనకల్ మండల కేంద్రంలోని కస్తూర్బాలో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలనూ సందర్శించి సిబ్బందికి, విద్యార్థులకు పలు సూచనలు చేయగా ఆయన వెంట ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ ఉన్నారు. మధిర సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) సన్యాసయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ విద్యాలత, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ అహమద్ సఫీ ఉల్లా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొనగా, నేలకొండపల్లి తహసీల్‌లో తహసీల్దార్ ఇమ్రాన్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్ రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

- వచ్చే నెల 7న వినాయక చవితి, 16న సామూహిక గణేష్ నిమజ్జనోత్సవం
- మట్టి వినాయక విగ్రహాలకు ప్రాధాన్యం
- స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటి



సమావేశంలో పాల్గొన్న ఉత్సవ సమితి ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: వినాయక చవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అంతా సిద్ధం కావాలని స్తంభాద్రి ఉత్సవ సమితి పిలుపునిచ్చింది. గురువారం నగరంలోని మామిళ్లగూడెం ఉత్సవ సమితి కార్యాలయంలో కమిటీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 7వ తేదీన వినాయక ఉత్సవాలను ప్రారంభించాలని, 16న సామూహిక గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించేలా కమిటీ నిర్ణయించిందన్నారు. సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గెంటేల విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి కీసర జయపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలతో ఉత్సవాలను నిర్వహించేందకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంటూ త్వరలో మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సమితి కన్వీనర్ కన్నం ప్రసన్నకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి మూలగుండ్ల శ్రీహరి, సహాయ కార్యదర్శులు డౌలే ఆయికిరణ్, వేల్పుల సుధాకర్, కేశవ్ పటేల్, ఈశ్వరప్రగడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సొసైటీ భూముల్లో రగడ..



ఇరువర్గాల వారితో మాట్లాడుతున్న సీఐ కిరణ్

సత్తుపల్లి: మండలంలోని రామగోవిందాపురం ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కో–ఆపరేటివ్ సొసైటీ బీ.గంగారం భూముల్లో వివాదం నెలకొంది. ఈమేరకు గట్టుబజార్, కొమరంభీం కాలనీకి చెందిన సొసైటీ సభ్యుల మధ్య గురువారం వాగ్వాదం చోటు చేసుకుంది. రామగోవిందాపురం కొమరంభీం కాలనీకి చెందిన సొసైటీ సభ్యుల భూముల్లో దున్నేందుకు ట్రాక్టర్లను తీసుకెళ్లగా.. గంగారం గట్టుబజార్‌కు చెందిన గిరిజనులు అడ్డుకున్నారు. ఈ భూముల్లో మాకే హక్కు ఉందంటూ ఇరువర్గాలు పరస్పరం ఘర్షణ పడడంతో సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలతో చర్చించారు. జిల్లా సహకార శాఖ అధికారి వచ్చి సొసైటీ సభ్యుల వివరాలు, భూముల విషయాలను తేల్చేవరకూ ఇరువర్గాలు భూముల్లోకి వెళ్లొద్దని సర్ది చెప్పడంతో వివాదం సర్దుమణిగింది. ఆ గ్రామంలో సొసైటీ భూముల విషయంలో గత పది రోజుల నుంచి ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా.. గిరిజనుల్లో రెండువర్గాలుగా ఏర్పడి వారికి కొందరు రాజకీయంగా అండదండలు అందిస్తుండడంతో వివాదం కాస్తా ఘర్షణకు దారితీస్తుంది. ఈ వివాదంపై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాల నుంచి పరస్పర ఫిర్యాదులు అందాయి.

'రియాక్టర్' ఘటనలో మండల వాసి దుర్మరణం



సురేంద్ర (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఏపీలోని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం వద్ద గల ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు ప్రమాద ఘటనలో అశ్వారావుపేట మండలం గంగారం గ్రామానికి చెందిన మార్ని సురేంద్ర(37) మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదం నెలకొంది. సురేంద్ర విశాఖపట్నంలోని గాజువాకలో నివాసం ఉంటూ గడిచిన తొమ్మిదేళ్లుగా అచ్యుతాపురంలో గల ఫార్మా సెజ్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. రియాక్టర్ పేలుడు ప్రమాదంలో చిక్కుకుని దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని గురువారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తెతో పాటు తల్లి జమున ఉన్నారు.

ఒక్కగానొక్క కొడుకు..

అశ్వారావుపేట మండలం గంగారం గ్రామానికి చెందిన మార్ని కృష్ణారావు, భార్య జమున దంపతులకు సురేంద్ర ఒక్కగానొక్క కొడుకు. తండ్రి కృష్ణారావు చిన్నప్పుడే మృతి చెందడంతో తల్లి ఒక్కతే సురేంద్రను ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) వరకు చదివించింది. దీంతో ఆ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం రావడంతో గత తొమ్మిదేళ్లుగా అదే కంపెనీలో పని చేస్తుండగా.. ఈ పేలుడు సంభవించి మృత్యువాత పడ్డాడు. సురేంద్ర మృతితో కుటుంబానికి ఆధారం లేకుండా పోయిందని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బడ్జెట్ కేటాయింపుపై హర్షం

కొత్తగూడెంఅర్బన్: మల్కాన్‌గిరి నుంచి భద్రాచలం వరకు నూతన రైల్వే లైన్‌తో పాటు బడ్జెట్ కూడా మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవి కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దక్షిణ భారత అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రం వరకూ రైలు మార్గం ఏర్పాటు చేయడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వివరించారు.

25తో ముగుస్తున్న డీఈడీ ప్రవేశాలు

భద్రాచలంఅర్బన్: గిరిజన డీఎల్‌ఈడీ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వైకేడీ భవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మొత్తం 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని, దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఏజెన్సీ ప్రాంత వాసులై ఇంటర్మీడియట్‌లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలన్నారు. దరఖాస్తులను భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులోని డీఎల్‌ఈడీ కళాశాలలో ఇవ్వాలని, మరిన్ని వివరాలకు 99595 75539, 79812 55624 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఇంజనీరింగ్ విద్యార్థి దారుణ హత్య

- కత్తితో దాడి చేసిన స్నేహితుడు
- ఛాతి, కడుపు భాగాల్లో పోట్లు
- రక్తపు మడుగులో పడిపోయిన బాధితుడు
- బైక్ ఎక్కి పరారైన నిందితులు
- రంగారెడ్డి జిల్లా బాలాపూర్ ఠాణా పరిధిలో ఘటన



ప్రశాంత్ (ఫైల్)




హత్య అనంతరం పారిపోతున్న నిందితులు (సీసీ కెమెరా ఫుటేజ్)

పహాడీషరీఫ్/ఎర్రుపాలెం : పట్టపగలు తోటి స్నేహితులే ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని దారుణంగా హత్య చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన శాంతయ్య, అనిత దంపతుల కుమారుడు మొండ్రు ప్రశాంత్ (21) నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం వీరు బాలాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. గురువారం పరీక్ష ముగిసిన అనంతరం సాయంత్రం 4:30 గంటలకు ప్రశాంత్ తన స్నేహితులైన (బీటెక్ క్లాస్‌మేట్స్ కాదు) ముగ్గురితో కలిసి బాలాపూర్ గణేశ్ చౌక్ సమీపంలోని '37 మండీ హౌజ్'కు చేరుకున్నారు. హోటల్ ఆవరణలోని పాన్ షాప్ వద్ద సిగరెట్ కొనుగోలు చేశారు. ఈ సమయంలో మాటామంతీ కొనసాగిస్తున్న క్రమంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహానికిలోనైన ఓ స్నేహితుడు అప్పటికే తనవెంట తెచ్చుకున్న కత్తితో ప్రశాంత్ కడుపు, ఛాతి భాగాలలో పొడిచాడు. తీవ్ర గాయాలతో బాధితుడు కుప్పకూలిపోగా.. మిగిలిన ముగ్గురూ ఒకే బైక్‌పై పరారయ్యారు. సమాచారం అందుకున్న బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి ఘటనా స్థలానికి చేరుకుని రక్తపు మడుగులో పడి ఉన్న ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ పి.లక్ష్మీకాంతరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని, స్థానికులను అడిగి హత్య వివరాలను తెలుసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఐటీ, ఎస్ఓటీ పోలీసులతో టీంలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నామని డీసీపీ తెలిపారు. కాగా ప్రశాంత్‌ను కత్తితో పొడిచిన యువకుడు సైతం బాలాపూర్‌లోనే నివాసం ఉంటూ ఓ పార్టీ నాయకుడికి అనుచరుడిగా కొనసాగుతున్నట్లు సమాచారం. కాగా నలుగురు యువకులు గంజాయి, సిగరెట్లకు బానిసలైనట్లు ప్రాథమికంగా తెలిసింది. కొద్ది రోజులుగా మూతపడి మరమ్మతుల అనంతరం మూడు రోజుల క్రితమే తెరుచుకున్న ఈ హోటల్ వద్ద తరచూ కలుసుకునేవారు. కాగా ఈ హత్యకు ప్రేమ వ్యవహారం ఏదైనా ఉందా..? ఫేమస్ కావాలంటే మర్డర్ చేయాలంటూ నిందితుడు తరచూ స్థానికంగా పేర్కొనేవాడని, దీన్ని బట్టి.. ఫేమస్ కావాలనే హత్య చేశాడా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా, ఒక్కగానొక్క కొడుకు హత్యకు గురికావడంతో శాంతయ్య, అనిత బోరున విలపిస్తున్నారు. ప్రశాంత్ హత్యతో అయ్యవారిగూడెంలో విషాదం నెలకొంది.

మద్యానికి డబ్బులివ్వలేదని..

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



సారయ్య (ఫైల్)

కరకగూడెం: మద్యానికి డబ్బులివ్వలేదని ఓ వ్యక్తి మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలను కరకగూడెం ఎస్సై రాజేందర్ ఇలా తెలిపారు. మండల పరిధిలోని మోతె గ్రామానికి చెందిన మంద సారయ్య(50) ఈ నెల 19న రాఖీ పండుగ కావడంతో మద్యానికి తన భార్య వెంకటమ్మను రూ.100 అడుగగా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో వెంటనే క్షణికావేశంలో పురుగుల మందు సేవించగా.. కుటుంబ సభ్యులు గమనించి ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతదేహానికి మణుగూరు ఏరియా ఆస్పత్రిలో శవ పరీక్షలు నిర్వహించారు.

కుటుంబ సభ్యుల వేధింపులతోనే ఆత్మహత్య

మృతుడి తల్లి ఆరోపణ

పాల్వంచ: కుటుంబ సభ్యుల వేధింపులతోనే తాపీ మేస్త్రీ దాగోర వెంకన్న (45)ఆత్మహత్యకు పాల్పడ్డాడని అతడి తల్లి సత్యవతి ఆరోపించింది. ఈ మేరకు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని బొల్లేరుగూడేనికి చెందిన తాపీ మేస్త్రీ వెంకన్న బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. కాగా, వెంకన్న మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడంటూ భార్య శ్రీలత, కుటుంబ సభ్యులు కొంతకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వేధింపులు తట్టుకోలేక తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని సత్యవతి తన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో శ్రీలతతో పాటు, బంధువులు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

రిజర్వాయర్‌లో మత్స్యకారుడి గల్లంతు



మత్స్యకారులతో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రహీమ్

వైరా: వైరా రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు గల్లంతైన సంఘటన గురువారం వైరాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే వైరా హనుమాన్ బజార్‌కు చెందిన ఈర్ల రాములు(46) తెల్లవారుజామున రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లాడు. అదే సమయాన ఈదురు గాలులు రావడంతో తెప్ప పల్టీ కొట్టినట్లు తోటి మత్స్యకారులు గుర్తించారు. ఉదయం నుంచి రాములు కోసం గాలింపు చర్యలు చేపట్టగా.. రాములు మృతదేహం లభ్యమైంది. మత్స్య సహకార సొసైటీ చైర్మన్ షేక్ రహీమ్ మత్స్యకారులతో మాట్లాడి అవసరమైన సహాయక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కట్లేరులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఎర్రుపాలెం: మండలంలోని ఇనగాలి గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసరెడ్డి(50) బుధవారం ప్రమాదవశాత్తు కట్లేరులో పడి గల్లంతైన విషయం తెలిసిందే. అయితే అతడి మృతదేహం కోసం స్థానికులు గాలిస్తున్న క్రమంలో సఖినవీడు గ్రామంలోని కట్లేరు చెక్‌డ్యాం వద్ద లభ్యమైంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ యరమల వెంకటరెడ్డితో పాటు పలువురు మృతదేహానికి నివాళి అర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండకు చెందిన ఉపేందర్ (35) అనే యువకుడు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయాన గడ్డి మందు తాగగా.. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

70 బస్తాల యూరియా పట్టివేత



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న పోలీసులు

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారంలో 70 బస్తాల యూరియాను గురువారం రాత్రి డంప్ చేస్తుండగా.. విశ్వసనీయ సమాచారంతో కొమరారం ఎస్సై సోమేశ్వర్ పట్టుకున్నారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇల్లెందు పీఏసీఎస్‌కు చెందిన గోదాం నుంచి బొలెరో వాహనంలో 70 బస్తాల యూరియాను రాత్రి సమయాన మాణిక్యారం గ్రామానికి తరలించారు. అక్కడ డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావుకు చెందిన గోదాంలో డంప్ చేస్తుండగా.. సమాచారం మేరకు ఎస్సై తనిఖీ చేయగా.. సరైన ఆధారాలు లేకపోవడంతో ఏఓ సతీష్‌కు సమాచారం అందించారు. కొనుగోలు చేస్తే రైతు పేరిట రశీదులు ఉంటాయని లేనిపక్షంలో ఆ బస్తాలను స్వాధీనం చేసుకోవచ్చని ఏఓ తెలపడంతో ఎస్సై వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా యూరియా లోడ్ వచ్చిన మరొక వాహనాన్ని పోలీసుల వస్తున్న సమాచారంతో దారి మళ్లించినట్లు ప్రచారం జరుగుతోంది.